క్లుప్తంగా

కల్యాణ వెంకన్నకు ప్రత్యేక పూజలు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో ఉన్న వ్యూహలక్ష్మీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఉదయం నుంచి స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు చేసి అలంకరణ చేపట్టారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చదలవాడ మోహన్‌కృష్ణ శర్మ, సుబ్రమణ్యం పీఠం సభ్యులు పాల్గొన్నారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణం

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని బంగారుపేట కోదండ రామస్వామి ఆలయంలో శనివారం సీతారాముల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. స్వామివారి జన్మ నక్షత్రం సందర్భంగా శనివారం ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య భక్తిశ్రద్ధలతో కల్యాణం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

కోర్టు ప్రాంగణంలో చెట్ల వేలం

కోట: కోట జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో శనివారం గత ఏడాది తుపానుకు పడిపోయిన చెట్లను వేలం వేశారు. వీటిలో విలువైన టేకు, వేప చెట్లు ఉన్నాయి. వేలంపాటలో పాల్గొన్న వ్యాపారులు మొత్తం రూ.77 వేలకు చెట్లను దక్కించుకున్నారు. జడ్జి భరత్‌కమల్ ఆదేశాల మేరకు ఫారెస్ట్ అధికారుల పర్యవేక్షణలో వేలం పాట నిర్వహించారు.

17న బహుజన ఐక్యవేదిక సభ

కోట: ఈ నెల 17న కోట షాదీ మంజిల్‌లో బహుజన ఐక్యవేదిక సభ నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం నాయకులు తెలిపారు. వారు శనివారం కోటలో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ కారంచేడు మారణ హోమం జరిగి 39 సంవత్సరాలు అయిన సందర్భంగా బహుజనుల్లో చైతన్యం నింపేందుకు కోటలో భారీ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి యునైటెడ్ ఫోరం జాతీయ ఉపాధ్యక్షుడు వేగూరు విజయ్ అంబేడ్కర్ హాజరవుతున్నట్లు తెలిపారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. తమిళనాడు బీఎస్పీ నాయకుడు ఆమ్‌స్ట్రాంగ్‌ను దుండగులు హత్య చేయడాన్ని బహుజన ఐక్యవేదిక నాయకులు ఖండించారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి



డయేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు రాజకుమారి

రాపూరు: డయేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వేపినాపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ప్రమీలరాణి తెలిపారు. ఆమె శనివారం వైద్య సిబ్బంది, విద్యార్థులతో కలిసి వేపినాపి గ్రామంలో డయేరియాపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల డయేరియా ప్రబలుతుందన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వర్షాకాలం వేడిగా ఉన్న ఆహారం తిన్నాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

గూడూరు రూరల్ : ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని గూడూరు పట్టణ సీఐ పాపారావు తెలిపారు. పట్టణంలోని టవర్ క్లాక్ కూడలి ప్రాంతంలో శనివారం ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మూడు రోడ్లలో హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న సుమారు 60 మందిని నిలిపి హెల్మెట్ వాడకపోవడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. వాహనాలను నడిపేటప్పుడు తమ కుటుంబ సభ్యులను గుర్తు చేసుకోవాలని, తద్వారా ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చని చెప్పారు. ఏదైనా ప్రమాదానికి గురైతే ఆ కుటుంబం పడే వేదన ఎలా ఉంటుందో తెలియజేశారు. పిల్లలకు ద్విచక్రవాహనాలు ఇవ్వొద్దన్నారు. ఒకటో పట్టణ ఎస్ఐ శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి

వెంకటగిరి(సైదాపురం) : బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని శనివారం ఎమ్మార్పీఎస్ నాయకులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వెంకటగిరి క్రాస్ రోడ్డు సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బాబూ జగ్జీవన్‌రావు చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మంగలపూరి సురేష్‌మాదిగ, పల్లిపాటి రవి, దళిత బహుజన వేదిక నాయకులు గోపాల్, ధనుంజయ, మునిరాఘవులు, ఉదయ్, భాస్కర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

వాకాడు : మండలంలోని తిరుమూరులో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని రూ.450 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపా రు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ముందుగా అందిన సమాచారం మేరకు దాడి చేసినట్టు తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, బెట్టింగ్, జూదం ఆడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీసీ గురుకులంలో వసతులు కరువు

- అసంపూర్తిగా భవన నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు
- మురుగుతున్న రూ.కోట్ల నాబార్డు నిధులు



డీవీ సత్రం బీసీ గురుకుల కళాశాలలో అసంపూర్తిగా ఉన్న భవనాలు

దొరవారిసత్రం : మండల కేంద్రమైన దొరవారిసత్రంలోని బీసీ గురుకుల కళాశాల విద్యార్థులు కనీస వసతులకు దూరంగా ఉన్నారు. స్థానిక బీసీ గురుకుల పాఠశాల ఆవరణలోనే 2017–18లో గురుకుల కళాశాలను ఏర్పాటు చేసి భవనాలు నిర్మించేందుకు నాబార్డు కింద సుమారు రూ.4.50 కోట్ల నిధులు మంజూరు చేశారు. కాంట్రాక్టర్ తరగతుల గదుల కోసం మూడు అంతస్తులతో రెండు బ్లాక్‌లు, ఉపాధ్యాయుల వసతి గృహాల కోసం నాలుగు బ్లాక్‌ల నిర్మాణం మొదలుపెట్టారు. తరగతి గదుల భవనం పనులు పూత పనులు వరకు పూర్తి చేశారు. ఉపాధ్యాయుల వసతి భవనంలోని రెండు బ్లాక్‌లు పూర్తి చేశారు. అప్పటి ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు ఆగిపోయాయి. తర్వాత ఎవరూ పట్టించుకోకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అసంపూర్తి భవనాల్లోనే తరగతులు

అర్ధాంతరంగా నిలిచిపోయిన భవనాల్లోనే ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు చెందిన 283 మంది విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయుల క్వార్టర్స్, పాఠశాలలోని ఒక భవనంలో విద్యార్థులకు వసతి కల్పించారు. విద్యార్థులు భోజనం చేయడానికి పాఠశాల డైనింగ్ హాల్‌కు వెళ్లాల్సిన దుస్థితి. భవన నిర్మాణాలు పూర్తి చేసి వసతి కల్పించాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



భవన నిర్మాణాల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ప్రభుత్వానికి నివేదించి నిధులు మంజూరుచేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కళాశాల విద్యార్థులకు అవసరమైన గదులు, వసతి భవనం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అసంపూర్తిగా ఉన్న భవనాల్లోని గదుల్లోనే విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నాం. - ఎం.తిరుపతయ్య, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్



అసంపూర్తిగా ఉన్న భవనం గదుల్లో తాత్కలికంగా ఏర్పాటు చేసిన బెంచీలు



విద్యార్థులకు వసతి కల్పించిన ఉపాధ్యాయుల క్వార్టర్స్

కల్యాణం.. కమనీయం



పెంచలకోనలో స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో శనివారం పెనుశిలలక్ష్మీ నరసింహస్వామి, ఆదిలక్ష్మీ దేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే స్వామిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కై ంకర్యాలు చేశారు. అనంతరం పూలంగి సేవ చేపట్టారు. 10 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను నిత్య కల్యాణ మండపంలో కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం అత్యంత వైభవంగా జరిపించారు. సాయంత్రం 6 గంటలకు తిరుచ్చి ఉత్సవాన్ని చేపట్టారు. తదనంతరం ఊంజల్ సేవ నిర్వహించారు. శ్రీవారిని పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.

సుబ్రమణ్య స్వామి సేవలో సినీ నటి అశ్వినీరెడ్డి



చిట్టమూరు(చిల్లకూరు) : చిట్టమూరు మండలం మల్లాంలో వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్య స్వామిని శనివారం ప్రముఖ సినీ నటి అశ్వినీ రెడ్డి దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు సాదర స్వాగతం పలికి స్వామి వారి దర్శనం కల్పించారు. అనంతరం స్వామి చిత్ర పటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ చాలా కాలంగా స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించాలని అనుకుంటున్నానని, ఇప్పటికి కోరిక నెరవేరిందని పేర్కొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు



చిల్లకూరు : నగదు బహుమతి అందుకున్న విద్యార్థులతో సంఘం ప్రతినిధులు, ఉపాధ్యాయులు



సైదాపురం: విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న డీవైఈవో, వైస్ ఎంపీపీ



నాయుడుపేట : గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

చిల్లకూరు : పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన చింతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం కాపు, బలిజ సంక్షేమ సంఘం ప్రతినిదులు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రతి ఏటా పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన పేద విద్యార్థులను ప్రోత్సహించేలా నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. పదో తరగతిలో 500లకు పైగా మార్కులు సాధించిన 9 మంది విద్యార్థులకు రూ.10 వేల అందజేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు తోట వెంకటశేషయ్య, ఏ నాగేశ్వరరావు, పీ శ్రీనివాసులు, పాఠశాల హెచ్‌ఎం శివసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు

సైదాపురం: విద్యతోనే ఉన్నత శిఖరాలు సాధ్యమని, ప్రతి విద్యార్థి బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని నెల్లూరు డీవైఈవో ప్రసన్న లక్ష్మి, వైస్ ఎంపీపీ తిరకాల భాస్కర్, ఎంఈవో దయాకర్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఏవో పురుషోత్తం శివకుమార్ తన తండ్రి సీవీ పురుషోత్తం జ్ఞాపకార్థం శనివారం ఊటుకూరు ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఏవో పురుషోత్తం మాట్లాడుతూ తన తండ్రి సైదాపురం ఉన్నత పాఠశాలలో 1970 నుంచి 1977 వరకు తెలుగు పండిట్‌గా పనిచేశారని తెలిపారు. ఆయన జ్ఞాపకార్థం విద్యార్థులకు తన వంతు సహాయ సహకారాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన దొడ్ల అమృత, తిరకాల గగన సింధు, సయ్యద్ ఆరీఫ్‌కు నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తిరకాల నారాయణరావు, గ్రామ పంచాయతీ సర్పంచ్ పెంచలయ్య, ఎంఈవో సుప్రి య, కార్యదర్శులు చంద్ర మోహన్, వీఆర్వో చెంచురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 2023–24 పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు శనివారం పూర్వ విద్యార్థులు నగదు పురస్కారాలు అందజేశారు. 557, 537, 536 మార్కులు సాధించిన నీలవాయి ఆదర్శరెడ్డి, మేదూరు భవ్య, ఎలుగంటి కౌశిక్‌కు వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు ఇచ్చారు. అనంతరం తమ గురువులను ఘనంగా సత్కరించారు. గూడూరు డీవైఈవో ఎం.శాంతి మాట్లాడుతూ 1987–88 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి చేయూత ఇవ్వడమే కాకుండా విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమని తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం సురేష్, ఎంఈవో మునిరత్నం, పూర్వ విద్యార్థులు కొర్రపాటి రమేష్ బాబు, చిల్లకూరు గోపీరెడ్డి, రమేష్ బాబు, సత్యనారాయణరెడ్డి, చిరంజీవి, చంద్రశేఖర్, రజనీబాబు, మహ్మద్ షఫీ పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

చిల్లకూరు : గూడూరు మున్సిపాలిటీ పరిధిలోని చెన్నూరులో పారిశుధ్యాన్ని మెరుగు పరిచేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. చాపకింద నీరులా డయేరియా అన్న శీర్షికన శనివారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మున్సిపల్ సిబ్బందిని గ్రామానికి పంపించి అక్కడి పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కాలువల్లో మురుగు తొలగించేలా చర్యలు చేపడతామన్నారు. అలాగే గ్రామంలో ఇద్దరు మహిళలు డయేరియాతో మృతి చెందలేదని, వయస్సు పైబడినందు వల్ల మృతిచెందారని తెలిపారు. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టడంతో పాటు నీటి నమూనాలను ల్యాబ్‌కు పంపి పరీక్షలు చేయిస్తున్నామని వివరించారు.

9న పెన్షనర్ల సమావేశం

గూడూరు రూరల్ : గూడూరులోని పెన్షనర్ల భవనంలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ పెన్షనర్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు మహబూబ్‌బాషా తెలిపారు. పెన్షనర్ల బ్యాంకుల సమస్యలపై చర్చించేందుకు ఎస్‌బీఐ అధికారుల సూచన మేరకు సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. సభ్యులు హాజరై సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చిడంతో పాటు సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.

ఘనంగా వారాహి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



హోమం చేస్తున్న వేద పండితులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని పటేల్ వీధిలో వెలసిన సాయి సంత్సగ నిలయంలో శనివారం వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. కోట సునీల్ స్వామి మాట్లాడుతూ వారాహి అమ్మవారి హోమం చేయడం ద్వారా శత్రువులపై సులభంగా విజయం సాధించవచ్చన్నారు. ఈ క్రమంలోనే అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అనంతరం వేద పండితులతో కలిసి హోమం చేపట్టారు.

చినుకు పడితే చిత్తడే

- అధ్వానంగా సైదాపురం – పొదలకూరు రోడ్డు



సైదాపురం : మండలంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి సైదాపురం–పొదలకూరు రోడ్డు అధ్వానంగా మారింది. అక్కడక్కడా గుంతలు పడి వాటిలో నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా సైదాపురం నుంచి ఊటుకూరు వరకు ఉన్న ఆర్ అండ్ బీ రహదారి గుంతలమయంగా మారడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి గుంతలను పూడ్చివేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



గుంతలు పడిన పొదలకూరు- సైదాపురం రోడ్డు

వైఎస్సార్ సీపీ నేతకు కిలివేటి పరామర్శ



అనీల్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య, నాయకులు

నాయుడుపేట టౌన్ : విన్నమాల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత అన్నమాల అనీల్ రెడ్డి తల్లి బుజ్జమ్మ(73) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య శనివారం విన్నమాల చేరుకుని బుజ్జమ్మ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనీల్ రెడ్డితోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి, నాయకులు ఆరవభూమి శ్రీనివాసులు రెడ్డి, మెస్ భాస్కర్ రెడ్డి, మారంరెడ్డి ముత్యాల రెడ్డి, షేక్ రహంతుల్లా, నాగిరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి, సురేష్ తదితరులు ఉన్నారు.



బుజ్జమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కిలివేటి సంజీవయ్య, నాయకులు

మహిళ రక్షణకు ప్రత్యేక చట్టాలు

వెంకటగిరి రూరల్ : మహిళలు, యువతుల రక్షణ దిశగా ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు అమలు చేస్తోందని వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి ఓ అనూష తెలిపారు. పట్టణంలోని విశ్వోదయ జూనియర్ కళాశాలలో శనివారం న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలపై అఘాయిత్యాలు జరగకుండా చూసేందుకు నిర్భయ యాక్ట్, పోక్సో యాక్ట్ చట్టాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఎవరైనా ప్రమాదంలో ఉన్నప్పుడు దిశ యాప్ ద్వారా పోలీసుల సహాయం పొందవచ్చన్నారు. కళాశాలలో ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన శిక్ష విధిస్తామని హెచ్చరించారు. అనంతరం కొత్తగా అమల్లోకి వచ్చిన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ మెంబర్ ఎస్ రాజేష్, రాజారావు, హేమగాంధీ, వెంకటగిరి ఎస్ఐ జిత్యానాయక్, కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి అనూష

ప్రకృతి సేద్యంతో అధిక దిగుబడులు



తనియాలిలో రైతులతో మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

దొరవారిసత్రం : రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి ప్రకృతి సేద్యం చేపడితే తక్కువ ఖర్చుతో పాటు అధిక దిగుబడులు సాధించి లాభాలు పొందవచ్చని సూళ్లూరుపేట సబ్ డివిజన్ ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ షబీనా తెలిపారు. ఆమె శనివారం ఏకొల్లు, తల్లంపాడు, తనియాలి తదితర గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం కింద సాగు చేసిన పంటలను పరిశీలించారు. రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు ప్రీ మాన్‌సూన్ డ్రై సూయింగ్(పీఎండీఎస్) పద్ధతిలో 32 రకాల విత్తనాలు పొలాల్లో చల్లాలన్నారు. దీని వల్ల భూమిలో సూక్ష్మపోషకాలు వృద్ధి చెందుతాయని తెలిపారు. వానపాములు పెరగడానికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ఎకరాకు పచ్చిరొట్ట విత్తనాలు జీలుగ, జనుము, పిల్లపెసరతో పాటు పీఎండీఎస్ విత్తనాలు 14 కేజీల వరకు చల్లుకుంటే మంచి ఫలితాలు వస్తాయని అవగాహన కల్పించారు. ఆమె వెంట ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నిర్మల, సంజీవరావు, శ్రీనివాసులు, మారయ్య, రమణయ్య తదితరులు ఉన్నారు.

పెంపుడు జంతువులకు రేబిస్ టీకాలు వేయించాలి



పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న ఏడీ సురేష్



వాకాడు : కుక్కకు టీకా వేస్తున్న ఏడీ రమణయ్య

గూడూరు రూరల్ : పెంపుడు జంతువుల నుంచి మనుషులకు జూనోటిక్ వ్యాధులు సంక్రమిస్తాయని, వాటిని నివారించేందుకు జంతువులకు ఏడాదికొకసారి తప్పనిసరిగా యాంటీ రేబిస్ టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు సురేష్ తెలిపారు. ఆయన శనివారం గూడూరులోని బనిగేసాహెబ్ పేటలో పెంపుడు జంతువులకు ఉచితంగా టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ జంతువులు, మనుషుల మధ్య విడదీయరాని బంధం ఉందన్నారు. ఎక్కువ మంది జంతువులను సంరక్షిస్తుంటారని తెలిపారు. వాటి వల్ల ఇబ్బంది పడకుండా టీకాలు వేయించుకోవాలని సూచించారు.

పెంపుడు జంతువులకు యాంటీ రేబిస్ టీకాలు

వాకాడు : ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం వాకాడు పశువైద్యశాలలో జంతువులకు యాంటీ రేబిస్ టీకాలు వేశారు. పశు వైద్యశాల ఏడీ డి.రమణయ్య మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను అరికట్టేందుకు యాంటీ రేబిస్ టీకాలు వేస్తున్నట్టు తెలిపారు. శనివారం 20 జంతువులకు టీకాలు వేసినట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పెంపుడు జంతువులకు టీకాలు వేయించుకోవాలన్నారు.

ఘనంగా లక్ష్మీ నరసింహస్వామి పల్లకీ సేవ

చిల్లకూరు : మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి, అమ్మవార్లకు పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామితో పాటు ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. లింగవరం గ్రామానికి చెందిన కొట్టే రామోహన్, రేణుక, దార్మిక్, జోష్టికలు ఉభయకర్తలుగా వ్యవహరించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకిపై ఉంచి ఆలయ ఆవరణలో ఊరేగించారు. కార్యక్రమాన్ని ఈవో తాతా శ్రీనివాసరావు, కలవకొండ యూత్ పర్యవేక్షించారు.